# మహా జాతరకు గవర్నర్‌కు ఆహ్వానం

గవర్నర్‌కు ఆహ్వాన పత్రాన్ని అందిస్తున్న సీతక్క

ములుగు, ఫిబ్రవరి 8 (నమస్తేతెలంగాణ) : మేడారం గ్రామంలో ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే సమ్మక్క-సారలమ్మ మహా జాతరకు హాజరు కావాలని కోరుతూ గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌కు మంత్రి దనసరి అనసూయ (సీతక్క) గురువారం రాజ్‌భవన్‌లో ఆహ్వాన పత్రిక అందించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క గవర్నర్‌కు జాతర విశిష్టతను వివరించి అమ్మవార్ల గద్దెల నమూన ప్రతిమను అందజేశారు. అనంతరం గవర్నర్‌ను శాలువాతో సత్కరించి మేడారం ఆహ్వాన పత్రికను అందజేశారు.

## శునకానికి తులాభారం

ఎత్తుబెల్లం తులాభారం వేయించుకుంటున్న శునకం

తాడ్వాయి, ఫిబ్రవరి 8 : జాతరలో గురువారం దంపతులు తమ పెంపుడు కుక్క ఎత్తు బంగారాన్ని తల్లులకు సమర్పించారు. గతంలో వారు మేడారం వచ్చిన సమయంలో కుక్క (లియో) అనారోగ్యం బారిన పడగా ఎత్తు బంగారం సమర్పిస్తామని దంపతులు పోశాల జ్యోతి, భిక్షపతి మొక్కుకున్నట్లు చెప్పారు. దాని ఆరోగ్యం కుదుటపడటంతో జాతరకు వచ్చి తులాభారం వేయించి తల్లులకు సమర్పించారు. ఈ దృశ్యాన్ని భక్తులు వింతగా చూశారు.

## తల్లులకు సుగంధ మాలలు, పట్టు వస్త్రాలు సమర్పిస్తా

జాతీయ మిర్చి టాస్క్‌ఫోర్స్ డైరెక్టర్

తాడ్వాయి, ఫిబ్రవరి 8 : వన దేవతలకు సుగంధ మాలలతోపాటు పట్టు వస్త్రాలు సమర్పించనున్నట్లు జాతీయ మిర్చి టాస్క్‌ఫోర్స్ డైరెక్టర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి తెలిపారు. గురువారం మేడారం వచ్చిన ఆయన మొక్కులు చెల్లించి మాట్లాడుతూ తెలంగాణ కుంభ మేళాగా పేరున్న సమ్మక్క, సారలమ్మకు కేరళ రాష్ట్రంలో ప్రత్యేకంగా తయారు చేసి తెప్పించిన చందన మాలలు, సుగంధ హారాలు, పట్టు వస్త్రాలు మంత్రి సీతక్క చేతుల మీదుగా అమ్మవార్లకు మహా జాతర సమయంలో బహూకరించనున్నట్లు తెలిపారు.

# దసలిపట్టు గూళ్ల బహిరంగ వేలం

బహిరంగ వేలం నిర్వహిస్తున్న సెరికల్చర్ అధికారులు

- ఒక్కో గూడుకు రూ. 4.90 పలికిన ధర
- గతేడాది రూ. 6.60కి అమ్మకం
- నిరాశలో రైతులు

మహదేవపూర్, ఫిబ్రవరి 8 : మండల కేంద్రంలోని సెరికల్చర్ కార్యాలయ ఆవరణలో అధికారులు గురువారం దసలిపట్టు గూళ్ల బహిరంగ వేలం నిర్వహిచారు. 17 లక్షల పట్టుగూళ్లకు వేలం నిర్వహించగా జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర తదితర పలు రాష్ట్రాలకు చెందిన రీలర్స్ పాల్గొన్నారు. వేలం పాటలో నాణ్యమైన పట్టు గూళ్ల వెయ్యికి రూ. 4,900, జల్లికి రూ.1,475, బుగ్ర(పీసీ) పట్టు గూళ్లకు రూ.1,000 చొప్పున ధర పలికింది. గతేడాదికంటే ఈసారి పంట దిగుబడి అధికంగా రావడంతో పట్టు గూళ్లకు మంచి ధర వస్తుందనే విశ్వాసంతో ఉన్న పట్టు రైతులకు వేలంలో దక్కిన ధరతో నిరాశే మిగిలింది. గతేడాది ఒక్కో గూడుకు రూ. 6.60 రాగా, ప్రస్తుతం రూ. 4.90 దక్కడంతో రైతుల ఆశలు అడియాశలయ్యాయి. వేలం పాటలో భూపాలపల్లి జిల్లా పట్టు పరిశ్రమ సంయుక్త సంచాలకురాలు జీ అనసూయ, సహాయ సంచాలకుడు పీ రవిప్రసాద్, ములుగు జిల్లా పట్టు పరిశ్రమ అధికారి నరేందర్, మండల సెరీకల్చర్ అధికారి పీ సమ్మయ్య పట్టు రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT HANAMKONDA
O.S. No 110 of 2017
Between :
T. Venugopal ...Plaintiff
And
Ch. Sheshu Kumar ...Defendant
To.,
Chidurala Seshu Kumar S/o Late Samba Reddy, Age: 38yrs, Occ: Employee in SCCL, R/o H.No. 7-52, Reddy Colony, Bhupalpalli City, Jayashankar Bhupalpalli District.
NOTICE
Please take notice that the above named plaintiff filed a suit against you for recovery of money for Rs. 7,56,600-00 (Rs. Seven Lakhs Fifty Six thousand Six hundred only). The above case is posted to 20-02-2024 for your appearance. Therefore, it is hereby informed that, you are required to appear in person or through an advocate and to file written statement if any, before the above court on 20-02-2024 at 10.30 am., otherwise the matter willbe decided as per law.
//BY THE ORDER OF THE COURT//
Sd/- CH. CHIDAMBERNATH
Sri Shivananda Lahari, H.No. 11-23-2175, Ganesh Nagar, Techers Colony, Desaipet Road, Warangal.

## టాలెంట్ టెస్ట్‌ను విజయవంతం చేయాలి

ఏటూరునాగారం, ఫిబ్రవరి 8 : టెస్ట్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేసేందుకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టాలెంట్ టెస్ట్‌ను విజయవంతం చేయాలని ఏటూరునాగారం డివిజన్ కార్యదర్శి జాగటి రవితేజ కోరారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో పోస్టర్లను ఆవిష్కరించారు. వివరాలకోసం 76010 91296 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు బట్ట స్వామి, ముక్కెర ధనుష్, డివిజన్ ఉపాధ్యక్షుడు కావేరి బైరేశ్ పాల్గొన్నారు.

# గిరిజన సంప్రదాయం ప్రకారమే జాతర

- ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు
- పారిశుధ్య నిర్వహణకు చర్యలు
- ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

తాడ్వాయి, ఫిబ్రవరి 8 : మేడారం మహా జాతరను గిరిజన సంప్రదాయం ప్రకారం ఘనంగా నిర్వహిస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. హరిత హోటల్‌లో గురువారం ఎస్పీ శబరీష్, పీవో అంకిత్, అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. జాతరలో గిరిజన సంప్రదాయాలు ఉట్టిపడేలా రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక పెయింటింగ్‌లు ఏర్పాటు చేశామన్నారు. నాలుగు వేల మంది పారిశుధ్య కార్మికులతో పాటు ఐటీసీ, సింగరేణి సంస్థల ద్వారా ఏర్పాటు చేసిన ప్రత్యేక యంత్రాల ద్వారా పారిశుధ్య పనులు చేయిస్తున్నట్లు వివరించారు. యానిమల్ వేస్టేజ్, టాయిలెట్ వేస్టేజ్ ప్రాసెసింగ్ చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో 14 క్లస్టర్లలో 279యూనిట్స్ ద్వారా 5.532టాయిలెట్స్, 230 నూతన బోర్లు ఏర్పాటు చేశామని చెప్పారు. ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో జంపన్నవాగులో రద్దీగా ఉండే ప్రదేశాల్లో గజ ఈతగాళ్లను నియమించామన్నారు. 14న లక్నవరం సరస్సు నుంచి నీటిని విడుదల చేస్తామని తెలిపారు. వైద్యశాఖ ద్వారా 30 హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి అంబులెన్సులు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. ఆర్టీసీ బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పించామని అన్నారు. ఎస్పీ శబరీష్ మాట్లాడుతూ పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జాతరలో 14 వేల మంది సిబ్బంది విధులు నిర్వహిస్తారన్నారు. ప్రత్యేక ప్రణాళికతో ట్రాఫిక్, క్రైమ్, భక్తుల రద్దీని కంట్రోల్ చేయనున్నట్లు వివరించారు. వనదేవతలను తీసుకొచ్చే క్రమంలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని, రోప్ పార్టీ ద్వారా క్రౌడ్ కంట్రోల్ చేయడానికి ప్రత్యేక టెక్నాలజీని ఉపయోగిస్తున్నామని తెలిపారు. జాతర పరిసరాల్లో 500 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పరిశీలిస్తామన్నారు. వీవీఐపీ, వీఐపీ దర్శణాల వలన సామాన్య భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాతరకు వస్తున్న నేపథ్యంలో పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్, ఈవో రాజేంద్రం పాల్గొన్నారు.

## మొబైల్ టెస్టింగ్ వ్యాన్ ప్రారంభం

ములుగురూరల్, ఫిబ్రవరి 8 : జాతర సందర్భంగా ఆహార పదార్థాల నాణ్యతను పరీక్షించేందుకు ఫుడ్ సేఫ్టీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొబైల్ టెస్టింగ్ వ్యాన్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం కలెక్టరేట్‌లో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తులు, వినియోగదారులకు ఆహార పదార్థాలపై అవగాహన కల్పించేందుకు మొబైల్ టెస్టింగ్ వ్యాన్‌ను జాతరలో మొదటి సారిగా ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ అధికారి అమృతశ్రీ, ఫుడ్ సేఫ్టీ అధికారి రోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.

# దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి

- ఇంటింటికీ వెళ్లి తప్పులు సవరించాలి
- భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా

గణపురం : దరఖాస్తుదారుల డేటాను పరిశీలిస్తున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

రేగొండ/గణపురం, ఫిబ్రవరి 8 :ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా ప్రభుత్వం స్వీకరించిన అభయ హస్తం దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అందులోని తప్పులను సవరించాలని భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. గురువారం రేగొండ తహసీల్దార్, గణపురం ఎంపీడీవో కార్యాలయాలను ఆయన సందర్శించి అర్జీదారుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారులు గ్యాస్, ఆధార్, రేషన్ కార్డు, మొబైల్ నంబర్లను తప్పుగా నమోదు చేశారని, దరఖాస్తులను తీసుకొని అధికారులు ఇంటింటికీ వెళ్లి వివరాలన్నీ సరిచూడాలని, ఆ తర్వాతే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. లేనిపక్షంలో అర్హులు ఆరు గ్యారెంటీలను కోల్పోతారని, ఈ విషయమై అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఆయన వెంట ప్రత్యేకాధికారులు డీఆర్డీవో పురుషోత్తం, సామెల్, తహసీల్దార్లు మురళీధర్‌రావు, సత్యనారాయణస్వామి, ఎంపీడీవోలు అరుంధతి, సురేందర్‌గౌడ్ తదితరులున్నారు.

### విద్యార్థులు మేధోశక్తిని పెంపొందించుకోవాలి

భూపాలపల్లి రూరల్ : విద్యార్థులు విద్యతో పాటు మేధోశక్తిని పెంపొందించుకోవాలని, కల్పన చావ్లా, శ్రీనివాస రామానుజాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. గురువారం భూపాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి పదో తరగతి విద్యార్థులకు గణితం, ఫిజిక్స్, ఇంగ్లిష్ పాఠాలు బోధించారు. బాగా చదువుకొని ఉత్తీర్ణత సాధించి జిల్లాకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. ఆయన వెంట డీఈవో ఎన్ రాంకుమార్, సెక్టోరియల్ అధికారి కిషన్‌రావు, ఉపాధ్యాయులున్నారు.

### రుణాలను వినియోగించుకోవాలి

రుణాలను వినియోగించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఏటూరునాగారం ఐటీడీఏ నుంచి రుణాలు పొందిన గిరిజన జేఎల్‌జీ సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గిరిజన శాఖ నుంచి సిమెంట్ ఇటుకల తయారీ యూనిట్‌కు రూ. 20 లక్షలు, రెండు కాంక్రీట్ మిక్సింగ్ యూనిట్లకు రూ. 80 లక్షలు, ఫుడ్ ట్రక్స్ వీల్ యూనిట్‌కు రూ. 13.50 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు.

సమావేశంలో ఐటీడీఏ ఏపీవో వసంతరావు, డీఆర్డీవో పురుషోత్తం, గ్రూప్‌ల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎదురుపిల్ల పండుగకు రండి

కలెక్టర్‌ను ఆహ్వానించిన గట్టమ్మ పూజారులు

కలెక్టర్ ఇలా త్రిపాఠికి ఆహ్వాన పత్రికను అందిస్తున్న సురేందర్, పూజారులు

ములుగురూరల్, ఫిబ్రవరి 8: గట్టమ్మ తల్లికి ఈ నెల 14న నిర్వహించే ఎదురు పిల్ల పండుగకు రావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠికి గురువారం పూజారులు ఆహ్వాన పత్రిక అం దించారు. అలాగే అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఎంపీడీవో ఎక్బాల్ హుస్సేన్, డిప్యూటీ చంద్రశేఖర్‌కు ఆహ్వాన పత్రికలను అందించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకపోడు జిల్లా అధ్యక్షుడు కొత్త సురేందర్ మాట్లాడుతూ 14న పది గంటలకు ఆదివాసీ నాయకపోడు పూజారుల ఇంట బోనం ఎత్తుకొని కులదైవం లక్ష్మీదేవర నృత్యాలతో డీఎల్ఆర్ ఫంక్షన్‌హాల్ నుంచి గట్టమ్మ వరకు ర్యాలీగా రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెండు నుంచి మూడు వేల వరకు నాయకపోడు కులస్తులు పాల్గొంటారని చెప్పారు. ప్రధాన పూజారులు కొత్త సదయ్య, కొత్త లక్ష్మయ్య, ఆకుల మొగిలి, అరిగెల సమ్మయ్య, రాజు, కొత్త రమేశ్ పాల్గొన్నారు.

## జాతర పనులు పూర్తి చేయాలి

మంత్రి సీతక్క

తాడ్వాయి, ఫిబ్రవరి 8 : మహా జాతరలో భాగంగా మేడారంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీవో అంకిత్‌తో కలిసి ఆమె మేడారంలో పర్యటించారు. మొదట ఊరట్టం లోలెవల్ కాజ్‌వే, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. మరుగుదొడ్లు, స్నానఘట్టాలపై ఏర్పాటు చేసిన చాటు గదులు, బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్‌ను పరిశీలించారు. ఆర్టీసి బస్టాండ్, గద్దెల పరిసరాల్లో పర్యటించి సౌకర్యాలను తెలుసుకున్నారు. భక్తులు ముందస్తుగా తరలివస్తుండడంతో వారికి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు ఉండాలని అధికారులను ఆదేశించారు. ప్లాస్టిక్‌ఫ్రీ జాతరగా నిర్వహించేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-319433

CHANGE OF NAME
★I, GOLI PULLAIAH (Old Name), R/o. H.No. 2-121, Jayapuram (V), Narsimhulapeta (Mdl.), Mahabubabad (Dist.)- 506324, T.S., Changed My Name as GOLI PULLA REDDY (New Name) S/o. GOLI VENKATA NARSAIAH.
NTW-5688

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

| HANAMKONDA | WARANAGAL |
|---|---|
| 9182777563 | 9182777556 |
| 9182777618 | 9182777557 |
| 9182777213 | 9182777558 |

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565

## తుది ఓటరు జాబితాలు విడుదల

భూపాలపల్లిలో 2,76,535, ములుగులో 2,31,883 మంది ఓటర్లు

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 8 : కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశాల మేరకు భూపాలపల్లి నియోజకవర్గ తుది ఓటరు జాబితాను గురువారం ఆర్డీవో రమాదేవి విడుదల చేశారు. నియోజకవర్గంలో మొత్తం 2,76,535 మంది ఓటర్లుండగా, ఇందులో పురుషులు 1,36,635, స్త్రీలు 1,39,894, ఇతరులు ఆరుగురున్నారు. భూపాలపల్లి మండలంలో 78,006 మంది, చిట్యాలలో 30,246, గణపురంలో 32,511, మొగుళ్లపల్లిలో 30,287, రేగొండలో 33,585, గోరికొత్తపల్లిలో 16,252, శాయంపేటలో 33,735, టేకుమట్ల మండలంలో 21,913 మందితో పాటు 173 సర్వీస్ ఓటర్లున్నారు. జిల్లాలోని ఆర్డీవో, తహసీల్దార్, వివిధ నిర్దేశిత కార్యాలయాల్లో జాబితాను అందుబాటులో ఉంచామని, ఓటర్లు తమ అనుమానాలను నివృత్తి చేసుకోవాలని రమాదేవి తెలిపారు.

**ములుగులో 2,31,883 మంది..**

ములుగు : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జిల్లా కలెక్టర్, ములుగు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఇలా త్రిపాఠి గురువారం సాయంత్రం తుది ఓటరు జాబితాను విడుదల చేశారు. ములుగు నియోజకవర్గ పరిధిలో ఓటర్ల సంఖ్య 2,31,883కు చేరింది. జిల్లాలోని ఏడు, మహబూబాబాద్ జిల్లాలోని రెండు మండలాల్లో కలిపి పురుషులు 1,13,262, మహిళలు 1,18,594 మంది ఉండగా 27 మంది ట్రాన్స్‌జెండర్లున్నారు.

## విద్యార్థులకు అభినందన

చిట్యాల, ఫిబ్రవరి 8 : రాష్ట్రస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు ఎంపికైన ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సాద సంజయ్, సరిగొమ్ముల హర్ష, సాదా సునీల్‌ను ఎంఈవో కోడపాక రఘుపతి అభినందించారు. శ్రీరాం, రఘుపతి, శనిగరపు భద్రయ్య, బొమ్మ రాజమౌళి, శంకర్, రాంనారాయణ, కల్పన, నీలిమారెడ్డి, సుజాత, రాజు, బుజ్జమ్మ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# అటవీ ప్రాంత ప్రజలకు అండగా ఉంటాం

- భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే
- పెగడపల్లిలో పోలీసుల మెగా హెల్త్ క్యాంప్
- 1000 మందికి వైద్య పరీక్షలు
- 100 మంది గొత్తికోయలకు దుప్పట్ల పంపిణీ

వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎస్పీ కిరణ్‌ఖరే

మహాముత్తారం, ఫిబ్రవరి 8 : అటవీ ప్రాంత ప్రజలకు పోలీస్ శాఖ అండగా ఉంటుందని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే అన్నారు. గురువారం మహాముత్తారం మండలంలోని పెగడపల్లిలో హైదరాబాద్ మలక్‌పేట యశోద దవాఖాన సౌజన్యంతో, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరానికి మహాముత్తారం, పలిమెల, భూపాలపల్లి మండలాలతో పాటు ఆరు గొత్తికోయ గూడేల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మారుమూల ప్రాంత ప్రజల ఆరోగ్యంపై పోలీస్ శాఖ ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందన్నారు. దాదాపు 1000 మందికి పలు రకాల పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు ఉచిత భోజన వసతి కల్పించామన్నారు. అలాగే 100 మంది గొత్తికోయలకు దుప్పట్లు పంపిణీ చేశామని, రాబోయే రోజుల్లో వారి అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు చేపడుతామని ఎస్పీ తెలిపారు. గొత్తికోయలకు అవసరమైన సాయాన్ని స్థానిక పోలీసులు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో భూపాలపల్లి అదనపు ఎస్పీ నరేశ్‌కుమార్, కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, జడ్పీటీసీ లింగమల్ల శారద, ఎంపీటీసీ జాటోత్ వసంత, ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు, కాటారం, భూపాలపల్లి, మహదేవ్‌పూర్ సీఐలు నాగార్జునరావు, నరేశ్‌కుమార్, రాజేశ్వరరావు, యశోద దవాఖాన సిబ్బంది, భూపాలపల్లి వైద్యులు డాక్టర్ కిరణ్, డాక్టర్ శ్రీనివాస్, మహాముత్తారం, ఆజంనగర్, అంబట్‌పల్లి, కాటారం పీహెచ్‌సీ వైద్యులు సందీప్, ప్రమోద్, రామారావు, మౌనిక, కాటారం సబ్‌డివిజన్ ఎస్సైలు, ఎమ్ఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# గైర్హాజరైన ఉద్యోగులకు కౌన్సెలింగ్

గణపురం, ఫిబ్రవరి 8 : మండలంలోని కేటీకే-8 ఇంక్లైన్‌లో 2023 సంవత్సరంలో 100 మస్టర్ల కంటే తక్కువ నమోదు చేసిన ఉద్యోగులకు అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గని మేనేజర్ భానుప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులు కంపెనీ ప్రయోజనాల కోసమే కాకుండా వారి కుటుంబం కోసం ప్రతిరోజూ విధులకు హాజరుకావాలని, ఉన్నతమైన ఉత్పత్తి సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సాయికృష్ణ, పిట్ సెక్రటరీ శంకర్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్యూలో అమ్మవార్ల దర్శనానికి వస్తున్న భక్తులు

# కిటకిటలాడుతున్న మేడారం

- వనదేవతల దర్శనానికి పోటెత్తుతున్న భక్తులు
- ఎత్తు బెల్లం సమర్పించి మొక్కుల చెల్లింపు

తాడ్వాయి, ఫిబ్రవరి 8 : మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు భక్తులు పోటెత్తుతున్నారు. వరాలిచ్చే తల్లులకు ముందుస్తు మొక్కులు చెల్లించేందుకు భారీగా తరలివస్తున్నారు. గురువారం రాష్ట్రంతో పాటు పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు మేడారం చేరుకున్నారు. జంపన్నవాగులో పుణ్య స్నానాలు చేసి తలనీలాలు సమర్పించి గద్దెల వద్దకు చేరుకున్నారు. ఎత్తుబెల్లం, పసుపు, కుంకుమ, సారె, పూలు, పండ్లు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రాకతో మేడారం పరిసరాలు కిటకిటలాడాయి. గద్దెల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దేవాదాయశాఖ అధికారులు, పోలీసులు పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారు. క్యూలైన్లలో దర్శనానికి అనుమతించారు. ఉదయం ఆరుగంటల నుంచి ప్రారంభమైన భక్తుల రద్దీ సాయంత్రం వరకు కొనసాగింది. అనంతరం గద్దెల పరిసరాలతో పాటు మేడారం పరిసరాల్లో విడిది చేశారు. భక్తుల వాహనాలతో పార్కింగ్ ప్రదేశాలు నిండిపోయాయి. మొదట గద్దెల సమీపంలోకి వాహనాలను అనుమతిచ్చిన పోలీసులు భక్తుల రద్దీని బట్టి రెడ్డిగూడెం క్రాస్, స్తూపం వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలకు వాహనాలను తరలించారు.

కేటీకే-6 ఇంక్లైన్ గనిలో అధికారులతో డీడీఎంఎస్ సనత్ కుమార్

## కార్మికులు రక్షణ పరికరాలు ధరించాలి

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 8 : సింగరేణి కార్మికులు రక్షణ పరికరాలు విధిగా ధరించి విధులు నిర్వర్తించాలని డీడీఎంఎస్ సనత్ కుమార్ అన్నారు. గురువారం భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-6 ఇంక్లైన్‌ను డీడీఎంఎస్ సనత్ కుమార్ సందర్శించారు. 1వ సీమ్ 5వ ప్యానల్‌ను పరిశీలించారు. కార్మికులకు ఎస్‌వోపీ, సేఫ్టీ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్పత్తిని పెంపొందించడానికి ప్రతి ఉద్యోగి కలిసి మెలిసి పనిచేయాలని సూచించారు. ఆయన వెంట సింగరేణి అధికారులు అజ్మీరా తుకారాం, హెచ్ఎన్ గుప్తా, రాజశేఖర్, నాగరాజు, శ్రీకాంత్, మహేందర్ తదితరులున్నారు.

## 'అభయ హస్తం' దరఖాస్తుల్లో తప్పల సవరణ

మహదేవపూర్ : వివరాలు సేకరిస్తున్న అధికారులు

మహదేవపూర్/కాటారం, ఫిబ్రవరి 8 : ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలు కోసం స్వీకరించిన 'అభయ హస్తం' దరఖాస్తుల్లోని తప్పుల సవరణను మహదేవపూర్, కాటారం మండలాల్లోని అన్ని గ్రామాల్లో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి ఆధార్, గ్యాస్, రేషన్ కార్డు నంబర్లను సరిచూసుకొని తప్పులను సవరిస్తున్నారు. ప్రత్యేకాధికారులు, డీఎల్‌పీవో సుధీర్ కుమార్, సంజీవరావు, ఎంపీడీవోలు రవీంద్రనాథ్, శంకర్‌నాయక్, ఏడీఈ నాగరాజు, ఏఈ మేఘనాథ్, ఎంపీవోలు ప్రసాద్, ఉపేంద్రయ్య, జీపీ కార్యదర్శులు దామోదర్‌రెడ్డి, అంజలి, రాజు, సతీశ్, సృజన్, రాజ్‌కుమార్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## మారని కొబ్బరికాయల వ్యాపారి తీరు

ములుగురూరల్, ఫిబ్రవరి 8 : గట్టమ్మ దేవాలయం వద్ద జాకారం జీపీ ద్వారా టెండర్ దక్కించుకున్న కొబ్బరి కాయల వ్యాపారి తీరు మారడంలేదు. 'నమస్తే తెలంగాణ'లో గురువారం 'కొబ్బరి కాయ @ 50' కథనం ప్రచురితం కాగా స్పందించిన కార్యదర్శి రమాదేవి నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని, గత టెండర్ ప్రకారం మాత్రమే విక్రయించాలన్నారు. కాగా, సదరు వ్యాపారి రూ.50కే విక్రయిస్తూ భక్తులపై భారంమోపుతున్నాడు. అయినా సదరు వ్యాపారిపై చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యమేమిటనే విమర్శలు వినిపిస్తున్నాయి.

## జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

రేగొండ, ఫిబ్రవరి 8 : జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు బాగిర్థిపేట ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థి రాహుల్ ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు సూదం సాంబమూర్తి తెలిపారు. గుజరాత్ రాష్ట్రంలో ఈ నెల 13 నుంచి 18 వరకు నిర్వహించే పోటీల్లో భాగంగా షాట్‌పుట్ విభాగంలో రాహుల్ పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రేవూరి అనిత, రాజయ్య, శ్రీనివాస్, ఇంద్రసేనారెడ్డి, మురళి, అనురాధ తదితరులు రాహుల్‌ను గురువారం సన్మానించారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు ..

మంగపేట, ఫిబ్రవరి 8 : రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండలంలోని కమలాపురం ఆర్ఎంసీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఫ్రాన్సినా, మేనేజర్ డియోడిత గురువారం తెలిపారు. ఈనెల 3న జిల్లా స్థాయిలో జరిగిన సబ్ జూనియర్ అండర్ -12 ఇయర్స్ బాలికల విభాగం జీ శ్రీవల్లి 100 మీటర్ల విభాగంలో, మధు షాలిని లాంగ్ జంప్‌లో ప్రతిభ కనబర్చినట్లు చెప్పారు. వీరు త్వరలో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొననున్న నేపథ్యంలో పీఈటీ శ్యాం ప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

## సకాలంలో ఎరువులు అందించాలి

వెంకటాపూర్, ఫిబ్రవరి 8 : రైతులకు సకాలంలో ఎరువులు అందించాలని జడ్పీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి అన్నారు. గురువారం మండలంలోని లక్ష్మీదేవిపేట పీఏసీఎస్ గోదామును ఆమె పరిశీలించి మాట్లాడారు. యాసంగి పంటకోసం అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉంచి, సకాలంలో అందేలా చూడాలని పీఏసీఎస్ చైర్మన్ ఎర్రబెల్లి గోపాల్‌రావుకు సూచించారు. ఆమెవెంట బీఆర్ఎస్ నాయకులు రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి, అంతటి రాముగౌడ్, ఎట్టి సతీశ్, రైతులు ఉన్నారు.

## ఈవీఎంల పరిశీలన


ఈవీఎంలను పరిశీలిస్తున్న లలిత్‌మిట్టల్

ములుగురూరల్, ఫిబ్రవరి 8 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కలెక్టరేట్‌లో కొనసాగుతున్న ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెకింగ్‌ను కేంద్ర ఎన్నికల సంఘం అసిస్టెంట్ చీఫ్ ఎలక్టోరల్ అధికారి లలిత్‌మిట్టల్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.